సింధు నాగరికత..లక్షణాలు

పేపర్-2, సెక్షన్-1, యూనిట్-1

గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామినేషన్‌లో రెండో పేపర్ మొత్తం చరిత్రే. విస్తృత ప్రిపరేషన్‌తోనే ఈ విభాగంలో మంచి స్కోరు సాధించవచ్చు. ఇక్కడ ముఖ్యంగా పాత విధానంలోని 'ఆప్షనల్ సబ్జెక్టుగా హిస్టరీ'.. కొత్త విధానంలోని 'హిస్టరీ పేపర్' ప్రిపరేషన్‌కు గల తేడాను సరిగా గమనించాలి. ఈ తేడాను గమనించకపోవడంతో గత గ్రూప్-1 పేపర్-2 లో అకడెమిక్‌గా హిస్టరీ నేపథ్యం ఉన్న అభ్యర్థులు కూడా అత్తెసరు మార్కులే సాధించారు.

ఇక.. తాజా నమూనా ప్రకారం.. అందుబాటులోని సమయాన్ని పరిగణిస్తే.. గ్రూప్-1 మెయిన్స్‌లో పది మార్కుల ప్రశ్నకు ఒక్కో దానికి 10 నుంచి 12 నిమిషాల్లో సమాధానం రాయాలి. ఈ వ్యవధిలో వేగంగా, ఎగ్జామినర్‌కు అర్థమయ్యేలా సమాధానం ఉండాలంటే 200 నుంచి 250 పదాలు మాత్రమే రాసే వీలుంటుంది. కాబట్టి ప్రశ్నకు నేరుగా, సంక్షిప్తంగా సమాధానం రాయడం ఎంతో అవసరం. ఓవైపు 'సంక్షిప్తం' సూత్రాన్ని పాటిస్తూనే సమాధానం సమగ్రంగా ఉండేలా చూసుకోవాలి. అయితే చరిత్ర పుస్తకాల్లో విస్తృతంగా ఉండే సమాచారాన్ని వడపోసి, అందులోని సారాన్ని గ్రహించి, దాన్ని సరళంగా సూటిగా వ్యక్తీకరించటం అంత సులభం కాదు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల అవగాహన కోసం గ్రూప్-1 హిస్టరీ సిలబస్‌లోని ముఖ్య అంశాలకు సంబంధించిన ప్రశ్నలు.. సమాధానాల విశ్లేషణ..

Q సింధు నాగరికత ప్రధాన లక్షణాలను వివరించండి?

A మొదటి పేరా:

సుమారు క్రీస్తు పూర్వం 2600 నుంచి 1750 వరకు వర్ధిల్లిన సింధు నాగరికత సమకాలీన ప్రాచీన నాగరికతలన్నింటి లోను అతి విస్తృత మైందిగా గుర్తింపు పొందింది.

రెండో పేరా:

సాధారణంగా ఈ నాగరికతలోని నగరాల నిర్మాణాన్ని పరిశీలిస్తే పశ్చిమ భాగంలో దుర్గం, తూర్పు భాగంలో జనావాసాలు ఉన్నట్లు తెలుస్తోంది. దుర్గం (citadel)లో సామూహిక ప్రయోజనాలకు, పాలన అవసరాలకు సంబంధించిన నిర్మాణాలు కనిపిస్తాయి. జనావాస ప్రాంతంలో వీధులు పరస్పరం లంబంగా ఖండించుకోవటం, వీధులకు ఇరువైపులా ఇళ్లు నిర్మించడం కనిపిస్తోంది. ఆ ఇళ్లను కాల్చిన ఇటుకలతో నిర్మించారు. ప్రతి ఇంటిలో ఉండే స్నానాల గది నుంచి బయల్దేరే కాలువ, వీధి కాలువతో అనుసంధానమైంది. కొన్ని కాలువలను రాతి పలకలతో కప్పి ఉంచారు.

మూడో పేరా:

సింధు ప్రజలు నదుల వరదలు తెచ్చే ఒండ్రు మట్టిని సన్నటి కర్ర నాగలి సహాయంతో సాగు చేశారు. నవంబరులో విత్తి, ఏప్రిల్‌లో పంటను కోసే వారు. గోధుమ, బార్లీ, నువ్వులు, ఆవాలు వంటివి



పండించారు. గుజరాత్‌లోని హరప్పా/ సింధు ప్రజలు వరిని కూడా పండించారు. ప్రపంచంలోనే తొలిసారిగా పత్తిని సాగు చేశారు.

నాలుగో పేరా:

సింధు ప్రజలు కుక్కలు, పిల్లులతోపాటు ఎడ్లు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులను మచ్చిక చేసుకున్నారు. గాడిదలు, ఒంటెలను (బరువులు మోసేందుకు) వస్తువుల రవాణాకు వినియోగించారు. ఈ ప్రజలకు గుర్రంతో ఉన్న పరిచయం మాత్రం ప్రశ్నార్థకం.

ఐదో పేరా:

సాంకేతికంగా సింధు నాగరికత కంచు యుగపు నాగరికత. రాగి సంగ్రహణ పద్ధతులను వృద్ధి చేసుకోవడంతోపాటు, రాగిని, తగరాన్ని కలిపి కంచును తయారు చేసుకున్నారు. లభించిన అవశేషాలను బట్టి ఆ నాగరికతలో లోహకారులు, నేత పని, కుండలు తయారీ, పూసలు తయారీ, ఇటుకలు తయారీ, తాపీ పని, తదితర వృత్తుల వారు చురుకైన పాత్రను పోషించారని అర్థమవుతోంది.

ఆరో పేరా:

విస్తృతంగా లభించిన ముద్రలు, ఏకరూపత కల్గిన లిపి, తూనికలు, కొలతలు, ఆ నాగరికతలో వాణిజ్యానికున్న ప్రాధాన్యాన్ని సూచిస్తున్నాయి. ప్రస్తుత మహారాష్ట్ర, మధ్య భారతం, రాజస్థాన్, హర్యానాలతోపాటు అఫ్ఘానిస్థాన్ వరకు వీరికి వాణిజ్య సంబంధాలున్నాయి. మెసపొటేమియాలో సింధు ప్రజల ముద్రలు లభించటం, అదే విధంగా మెసపొటేమియా ప్రజలు సింధు ప్రాంతాన్ని 'మెలూహా'గా అభివర్ణించటం, మెసపొటేమియా ప్రజలు వినియోగించిన కొన్ని సౌందర్య సాధనాలను సింధు ప్రజలు అనుకరించటం వంటి అంశాల ఆధారంగా వీరికి మెసపొటేమియా వరకు వాణిజ్య సంబంధాలున్నాయని చెప్పొచ్చు. లోథాల్ వద్ద వెలుగు చూసిన నౌకాశ్రయం సముద్రాంతర వాణిజ్యాన్ని సూచిస్తోంది.

ఏడో పేరా:

నగరాల నిర్మాణంలో కనిపించే ప్రమాణీకరణ, క్రమబద్ధత, పారిశుద్ధ్య వ్యవస్థ వంటివి పటిష్ట పాలనా వ్యవస్థను సూచిస్తున్నాయి. అయితే వారి లిపిని అర్థవంతంగా చదవలేకపోతున్నాం కనుక ఆ పాలక వర్గాలు ఎవరనేది కచ్చితంగా చెప్పలేం. అదే విధంగా ఆ నాగరికతలో రైతులు, పశు పాలకులు, చేతి వృత్తుల వారు, వర్తకులు, పాలకుల

మధ్య సున్నితమైన సామాజిక సమీకరణం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ సమీకరణం స్వభావాన్ని మాత్రం కచ్చితంగా అంచనా వేయలేం.

ఎనిమిదో పేరా:

లభించిన మట్టి బొమ్మల ఆధారంగా సింధు ప్రజలు అమ్మతల్లి (mother goddess)ని ఆరాధించేవారని భావించవచ్చు. అదే విధంగా ఒక ముద్రను బట్టి 'శివుడి'ని పశుపతి రూపంలో ఆరాధించారని ఊహిస్తున్నారు. బోధి వృక్షాన్ని, ఎద్దును కూడా పవిత్రంగా భావించి ఉండొచ్చు. తాయెత్తులు, రక్షరేకుల సహాయంతో దుష్టశక్తులను ఎదుర్కోవాలనుకున్నారు.

తొమ్మిదో పేరా:

సింధు నాగరికతలో స్త్రీ, పురుషులిద్దరూ ఆభరణాలపై మోజు ప్రదర్శించారని, సౌందర్య పిపాసులని, శాంతి కాముకులని కూడా భావించవచ్చు. అలాగే లోహ సంగ్రహణ సాంకేతికతతోపాటు ఇంజనీరింగ్ నైపుణ్యాలను, వ్యవసాయానికి కావాల్సిన రుతు పరిజ్ఞానాన్ని, అందుకు కావాల్సిన ఖగోళ విజ్ఞానాన్ని కలిగి ఉన్నారని చెప్పొచ్చు.

విశ్లేషణ:

సింధు నాగరికత ప్రధాన లక్షణాలను వివరంగా వర్ణిస్తే దాదాపు రెండు వేల పదాలకు పైగా రాయవచ్చు. కాబట్టి ఇలాంటి ప్రశ్నకు సమాధానం రాయడం అభ్యర్థికి కత్తి మీద సామే.

పై సమాధానాన్ని గమనిస్తే.. నాగరికత ప్రధాన లక్షణాలన్నిటినీ ప్రత్యేక పేరాగ్రాఫ్‌లుగా ఒక క్రమంలో వివరించటం మంచిది.

ఒకటో పేరాలో పరిచయం.. అందులోనే సింధు నాగరికత కాలం, విస్తృతి; రెండో పేరాలో పట్టణ ప్రణాళిక, మురుగు పారుదల గురించి; మూడో పేరాలో వ్యవసాయం; నాలుగో పేరాలో వారికి తెలిసిన జంతు ప్రపంచం; ఐదో పేరాలో చేతి వృత్తులు; ఆరో పేరాలో వాణిజ్యం; ఏడో పేరాలో రాజకీయ, సామాజిక వ్యవస్థలు; ఎనిమిదో పేరాలో మత విశ్వాసాలు; తొమ్మిదో పేరాలో జీవన శైలి, కళలు, సాంకేతిక అంశాలను వివరించాం. సింధు నాగరికత ప్రధాన లక్షణాలను చర్చించడానికి ఇదే సరైన క్రమం. ఇంకా పలు అంశాలు (ఉదా: స్నానఘట్టం, ధాన్యాగారాలు; సంఖ్యామానం; ముద్రలు; లిపి తదితరాలు) వివరించలేదు. అయితే పది మార్కుల ప్రశ్న కాబట్టి అత్యంత ప్రధానమైన అంశాలను వివరిస్తే సరిపోతుంది. ఈ విషయాన్ని గుర్తిస్తే నిర్ణీత వ్యవధిలో సరైన సమాధానాలు రాయవచ్చు.

Q సింధు నాగరికత పతనాన్ని విశ్లేషించండి?

A క్రీస్తు పూర్వం 1750 నాటికి సింధు నాగరికత క్షీణదశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. సింధు నాగరికత పతనానికి సంబంధించి ఎన్నో వాదోపవాదాలు జరిగాయి, జరుగుతున్నాయి.

గతంలో పరిశోధకులు.. సింధు నాగరికత హఠాత్తుగా, నాటకీయంగా పతనమైందని విశ్వసించారు. ఇందుకు ప్రకృతి విపత్తులను, బాహ్య శక్తుల దాడులను కారణాలుగా పేర్కొన్నారు.

ప్రకృతి విపత్తుల వల్ల సింధు నాగరికత పతనమైందని విశ్వసించిన వారిలో కొందరు 'మొహంజొదారో' ఆవాసాల్లో వరదలకు సంబంధించిన ఆధారాలను గుర్తించారు. ఈ ఆధారాలను సాగదీసి వరద బీభత్సం కారణంగానే సింధు నాగరికత పతనమైందని వాదించారు. కానీ దీనికి చాలా పరిమితులున్నాయి. 'హరప్పా'లో వరదకు సంబంధించిన ఆధారాలేవీ కనిపించలేదు. సింధు నదీ వ్యవస్థకు వెలుపల ఉన్న ఆవాసాల పతనాన్ని ఈ వాదన వివరించలేదు.

మరికొందరు పరిశోధకులు భూకంపాల వల్లనే సింధు నాగరికత పతనమైందని వాదించారు. భూకంపాల కారణంగా తీర ప్రాంతాలు పైకి చొచ్చుకు రావటంతో.. సముద్రంలోకి వెళ్లాల్సిన నదులు నగరాల్లోకి వచ్చి విధ్వంసం సృష్టించాయన్నారు. ఈ క్రమంలో నదీ మార్గాలపై ఆధారపడ్డ వాణిజ్య జీవనం దెబ్బతిందని కూడా వాదించారు. కానీ ఈ వాదనలను భూగర్భ శాస్త్రవేత్తలు ప్రశ్నిస్తున్నారు.

ఆర్యుల దాడి కారణంగానే సింధు నాగరికత పతనమైందని మార్టిమల్ వీలర్ విశ్వసించాడు. ఆ తర్వాత అనేక మంది ఆర్యుల దాడి సిద్ధాంతాన్ని అంగీకరించి ప్రచారంలోకి తీసుకొచ్చారు. ఈ వాదన చేసేవారు.. ఆర్యుల ప్రధాన దైవం ఇంద్రుడు రుగ్వేదంలో పురంధరుడిగా (పురాలను ధ్వంసం చేసేవాడిగా) వర్ణించడం; మొహంజొదారో పై పొరల్లో హత్యాకాండకు సంబంధించిన సూచనలు ఉండటం (ఉదా: వీధుల్లో కపాలాలు ఉండటం) వంటి అంశాలను ఆధారాలుగా చేసుకున్నారు. కానీ మొహంజొదారో నగరం క్రీస్తుపూర్వం 1800 నాటికే క్షీణదశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. క్రీస్తుపూర్వం 1500 నాటికి మాత్రమే ఆర్యులు భారతదేశంలోకి ప్రవేశించసాగారు. అలాగే తాజాగా మొహంజొదారోలోని కపాలాలను పరిశీలిస్తే వారిలో పలువురు తీవ్ర రక్త హీనత వంటి రకరకాల వ్యాధులతో మరణించినట్లు తెలుస్తోంది. ఏదైనా ఒక ప్రాంతంలో హింసాత్మక మరణాలు విదేశీయుల దాడులనే సూచించాలనే నియమమేదీ లేదు. అవి అంతర్గత సంఘర్షణలను కూడా సూచించవచ్చు. ఏది ఏమైనప్పటికీ సింధు నాగరికత క్షీణతకు (క్రీస్తు పూర్వం 1750).. ఆర్యుల రాక (క్రీస్తు పూర్వం 1500)కు మధ్య గల సుమారు రెండున్నర శతాబ్దాల కాల వ్యవధి 'ఆర్యుల దాడి సిద్ధాంతా'న్ని పూర్వపక్షం చేస్తోంది.

ఫెయిర్ సర్వీస్ వంటి వ్యక్తులు సింధు నాగరికత పతనానికి పర్యావరణ సంబంధ కారణాలను విశ్లేషించారు. పెరుగుతున్న మానవ, పశు జనాభా కారణంగా పర్యావరణంపై ఒత్తిడి పెరగటంతో అడవులు, గడ్డి భూములు అంతర్ధానమవటంతో వరదలు, క్షామాలు సంభవించి నాగరికత క్రమంగా పతనావస్థకు చేరుకుందనేది వీరి వాదన. కానీ వేల సంవత్సరాలుగా భారత ఉపఖండంలోని భూసారం ధ్రుడంగా కొనసాగటాన్ని పరిశీలిస్తే ఈ వాదనలోని బలహీనత అర్థం చేసుకోవచ్చు.

రొమిల్లా థాపర్ అభిప్రాయపడుతున్నట్లు.. సువిశాల సింధు నాగరికత క్షీణతను ఏ ఒక్క కారణంతోనో కాకుండా.. రకరకాల కారణాలతో విశ్లేషించాలి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధమైన కారణంతో పతనం సంభవించవచ్చు. సింధు నాగరికత రైతులకు, పశు పాలకులకు, నగరాల్లోని చేతి వృత్తుల వారికి, వర్తకులకు, పాలక వర్గాలకు

మధ్య గల సున్నిత సంబంధాలపై ఆధారపడి ఉంది. అదేవిధంగా సింధు ప్రజలు తమ పొరుగున ఉన్న రకరకాల ప్రజా సమూహాలపై కీలక ఖనిజాల కోసం ఆధారపడ్డారు. అదే విధంగా సమకాలీన నాగరికతలతో సంబంధాలు కూడా ఈ నాగరికతకు ముఖ్యమే. ఈ సంబంధాల్లో ఏవి దెబ్బతిన్నా, సింధు నాగరికతపై ప్రతికూల ప్రభావం చూపి, నగరాల క్షీణతకు దారి తీసే అవకాశం ఉంది.

విశ్లేషణ:

ఇదే ప్రశ్నను వేరే విధంగా కూడా అడిగే అవకాశం ఉంది.
ఉదా: 'సింధు నాగరికత పతనానికి, ఆర్యుల దాడే కారణమా?'– చర్చించండి. అని అడగొచ్చు.

ఈ ప్రశ్నకు సమాధానం ఆర్యుల దాడి సిద్ధాంతంతో మొదలై దానిలోని అసంబంధ్ధతలను బహిర్గతం చేయటంతోపాటు, నాగరికత పతనానికి ఇతర కారణాలను గురించి చూచాయగా వివరించటంతో ముగిస్తే సమంజసంగా ఉంటుంది.